## క్లుప్తంగా

### వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధుల్ని ఆదుకునేందుకు ముందుకురావాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. కొత్తపేట సోమువారివీధిలోని మండలి కార్యాలయంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు శింగంశెట్టి సాంబశివరావు, వీరాంజనేయులు, మండలి కార్యదర్శి పలకలూరి శివరావు, సభ్యులు పి.వి.సంజీవరావు, గార్లపాటి రోశయ్య, మాచర్ల ఉపేంద్ర, డి.రాజశేఖర్ పాల్గొన్నారు.

### నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 8.30 గంటలకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి రోజూ సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహిస్తారన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని కమిషనర్ తెలియజేశారు.

### మట్టి కుప్పలతో అవస్థలు



నెహ్రూనగర్: స్థానిక వాటర్ ట్యాంకుల నుంచి సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ వరకు 800 ఎంఎం డయా పైపులైన్ స్థానంలో 900 ఎంఎం డయా పైపులైన్ వేస్తున్న విషయం తెలిసిందే. అయితే, పైపులైన్ వేసేందుకు తీసిన మట్టిని రోడ్డుకు ఇరువైపులా దుకాణాల ముందు పోసి వదిలేశారు. రోజులు గడుస్తున్నా మట్టికుప్పలు తొలగించకపోవడంతో దుకాణాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంజినీరింగ్ అధికారులు స్పందించి మట్టికుప్పలను తొలగించాలని స్థానికులు, దుకాణాదారులు కోరుతున్నారు.

### గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు



నగరంపాలెం: గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ (సెబ్) గుంటూరు-1 స్టేషన్ సీఐ రమేష్ తెలిపారు. ఐపీడీ కాలనీ 9వ వీధిలోని ఓ ఇంట్లో ఆదివారం తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ క్రమంలో రూ.2,500 విలువ చేసే 340 గ్రాముల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకుని, కె.కోటేశ్వరిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. రెండు నెలలుగా ఆమె విక్రయాలు చేస్తుండగా, ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందని వివరించారు.

### అలరించిన సంగీత విభావరి



పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏకే కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అమానుల్లా ఖాన్ ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలు జయంతి పురస్కరించుకుని ఆదివారం స్వరాభిషేకం పేరున నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. గాయకులు రసూల్, హేమామాలిని, లలిత్‌బాబు, మహమ్మద్ ఖాజా, శివలీల, జరీనా, ప్రజ్ఞ పలు చిత్రాల్లోని పాటల్ని ఆలపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, సంస్థ గౌరవాధ్యక్షుడు చందు సాంబశివరావు పాల్గొన్నారు.

### రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

పెదకాకాని: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ సేవలు అభినందనీయమని మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.శివన్నారాయణ అన్నారు. గుంటూరు గీతా రీజెన్సీలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ 2022-23 అవార్డ్స్ కార్యక్రమం జరిగింది. సమావేశం అనంతరం క్లబ్ సభ్యులు రవిలిశెట్టి వేణుగోపాలరావు, పద్మజ సహకారంతో దివ్యాంగ పండ్ల వ్యాపారికి తోపుడు బండిని అందజేశారు. వడ్డవల్లి సతీష్ బాబు, విజయలక్ష్మి అక్షర వృద్ధాశ్రమానికి టీవీని బహూకరించారు. కాలీగ్రఫీ బుక్స్‌కి శివన్నారాయణ, క్లబ్ డైరెక్టర్ పి.ఆదిశేషులు రూ.25 వేలు చెక్ ను ఉపాధ్యాయులకు అందజేశారు.

# అంతా మా ఇష్టం..

- నిబంధనలు బేఖాతరు
- నగరంలో పగటి పూట తిరుగుతున్న భారీ వాహనాలు
- మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న పరిస్థితులు
- ఇటీవల పెరిగిన ప్రమాదాలు
- పట్టించుకోని పోలీసులు



గుజ్జనగుండ్ల సెంటర్ మీదుగా తిరుగుతున్న టిప్పర్, ట్రాక్టర్



కాకాని రోడ్డులో లోడు లారీ

పట్నంబజారు: భారీ వాహనాల డ్రైవర్లు నిబంధనలు పాటించడం లేదు. నగరంలో వేళలు పాటించకుండా తిరగడమే కాకుండా.. పైపెచ్చు మద్యం తాగి ఇష్టానుసారంగా రోడ్లపై తిరిగేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటలకు నగరంలోకి ట్రాక్టర్లు, లారీలు వంటి భారీ వాహనాలు ప్రవేశించకూడదనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది ఉన్నప్పటికీ, భారీ వాహనాల్ని నిలువరించలేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా.. కనీసం పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. భారీ వాహనాల్ని నియంత్రించడంలో ట్రాఫిక్ అధికారులు పూర్తి విఫలం చెందుతున్నారనే విమర్శలు లేకపోలేదు.

**ఇవిగో ఉదాహరణలు..**

➡ కొద్ది రోజుల కిందట కొరిటిపాడు సెంటర్‌లో ఆంజనేయులు అనే ట్రాక్టర్ డ్రైవర్ పూటుగా మద్యం తాగి, వృద్ధ దంపతులు వెళుతున్న కారును ఉదయం 11.30 సమయంలో ఢీకొట్టాడు. కారు వెనుక భాగం తుక్కుతుక్కు అయింది. ప్రాణ నష్టం జరగకపోవడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు.

➡ మూడు రోజుల కిందట శారదా కాలనీలో మద్యం తాగిన ఆటో డ్రైవర్ అక్కడ నుంచి డొంక రోడ్డు, కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ సెంటర్, కొత్తపేట మీదుగా వాహనాన్ని అడ్డగోలుగా నడుపుతూ, పలు వాహనాల్ని ఢీకొట్టుకుంటూ వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలకు గాయాలై ఆసుపత్రి పాలైయ్యారు.

➡ ఇటీవల మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గుజ్జనగుండ్ల సెంటర్‌లో లోడుతో వెళుతున్న టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. కనీసం వాహనం ఆపకుండా వెళ్లిపోయిన పరిస్థితులు దాపురించాయి.

➡ గతంలో సాయంత్రం 6 నుంచి 7 గంటల ప్రాంతంలో పెదపలకలూరు రోడ్డు, జేకేసీ కళాశాల రోడ్డులో జరిగిన రెండు ప్రమాదాల్లో టిప్పర్‌ల కారణంగానే ఇద్దరూ మృతి చెందారు.

**అడ్డగోలుగా అనుమతులు?**

ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ట్రాక్టర్లు, టిప్పర్లకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. గుంటూరు ఈస్ట్ పరిధిలోని కాకాని రోడ్డులో ఒక ప్రాంతం నుంచి వారానికి నాలుగు సార్లు పలు దఫాలుగా 40 లారీలకు పైగా వెళుతున్నాయని సమాచారం. ట్రాక్టర్ల పరిస్థితి అయితే ఇక చెప్పనవసరం లేదు. యథేచ్ఛగా నగరంలోకి ఇష్టానుసారంగా పట్టపగలే ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్ ముందు నుండే తిరుగుతున్నాయి. వీటితో పాటు పట్నంబజారు, లాలాపేట పరిసర ప్రాంతాల్లో నిత్యం లారీలు సరుకు రవాణా కోసం వస్తూనే ఉన్నాయి. ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల వాహనాలు నగరంలోకి ఎడాపెడా వస్తూనే ఉన్నాయి. వెస్ట్ పరిధిలోని గుజ్జనగుండ్ల ప్రాంతం మీదుగా టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీ రాకపోకలు యథాతథంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించే ఎస్ఐ స్థాయి అధికారి నెలవారీ మామూళ్ల ఒప్పందాలు కుదుర్చుకోవడంతో సిబ్బంది వాహనాలు నిలువరించే పరిస్థితి లేకుండా పోయింది. వాహనాన్ని పొరపాటున ఆపినా, ఫోటో తీసి స్టేషన్ అధికారులు పంపినా, సదరు ఎస్ఐ సిబ్బందిపై విరుచుకుపడతారని తెలుస్తోంది. భారీ వాహనాలు రోడ్డుపైకి రాకుండా నిలువరించి ప్రమాదాలు అరికట్టాలని ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### అనుమతి లేదు



భారీ వాహనాలు, ట్రాక్టర్లు, టిప్పర్లకు ఉదయం నగరంలోకి అనుమతి లేదు. ప్రవేశించిన వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. ప్రభుత్వ పరంగా పయనించే పలు వాహనాలకు మాత్రం కొద్ది రోజుల పాటు మాత్రమే అనుమతులు ఉంటాయి. ఇప్పటికే భారీ వాహనాలు రాకూడదని బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. వేళలు పాటించకుండా నగరంలోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– బాలసుందరరావు
(డీఎస్పీ, ట్రాఫిక్, గుంటూరు)

### జాయ్ అండ్ షైన్‌లో ఫాదర్స్ డే వేడుకలు



తల్లిదండ్రులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

గుంటూరు వెస్ట్: స్థానిక బ్రాడీపేటలోని జాయ్ అండ్ షైన్ ఫిట్‌నెస్ సెంటర్లో ఆదివారం ఫాదర్స్‌డే వేడుకల్ని ఘనంగా నిర్వహించారు.తండ్రుల్ని ఘనంగా సత్కరించారు. చీఫ్ కోచ్ జ్యోతి శ్యామ్ మాట్లాడుతూ బిడ్డల కోసం తండ్రి చేసే కష్టం, త్యాగాలు వర్ణించేందుకు పదాలు దొరకవని తెలిపారు. నేటి యువతలో తల్లిదండ్రులంటే కేవలం తమ అవసరాలు తీర్చే వారిగానే కనబడుతున్నారన్నారు. తండ్రి లేని బాధ ఎవ్వరూ తీర్చలేరని, వారు ఉన్నప్పుడు ప్రేమతో వ్యవహరించాలని తెలిపారు. బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ పెర్లి యాని అమల మాట్లాడుతూ పాఠశాలల దగ్గర్నుంచి కుటుంబ వ్యవస్థ పైనా, మన సంస్కృతి సాంప్రదాయాలపైనా చిన్నారులకు నేర్పించాలని తెలిపారు. సాక్షాత్తూ భగవంతుని రూపంలో మన బాగోగులు చూసే తండ్రి పాత్రను ఎంత చెప్పినా తక్కువేనని తెలిపారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త ఎస్.వెంకటేశ్వర్లు, భావన్నారాయణ, అయితి సతీష్, శ్యామ్, అనూషా బేబి, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

## ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



పత్రాలను చూపిస్తున్న ఆలపాటి రాజా, తిలక్ బాబు, శ్రీనివాస్, సీతారామయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: మేడికొండూరు మండలంలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలకు న్యూఢిల్లీలోని యూజీసీ నుంచి అటానమస్ హోదా లభించినట్లు కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. విద్యానగర్‌లోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల నగర కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతేడాది నాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు పొందిన తమ కళాశాలకు ప్రస్తుత ఏడాది అటానమస్ హోదా లభించడం ఉత్తమ విద్యా ప్రమాణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో రాబోవు ఏడాది కల్లా ఎన్‌బీఏ గుర్తింపుకు అర్హత సాధించే దిశగా ప్రయాణాన్ని ప్రారంభించామని తెలిపారు. స్వయం ప్రతిపత్తితో సొంత పాఠ్య ప్రణాళికలతో పాటు పరీక్షలు నిర్వహణ, డిగ్రీలను ప్రదానం చేయడం సహా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ఈ హోదాతో వివిధ బహుళజాతి సంస్థల ద్వారా నూరుశాతం ఉద్యోగాలు సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో నూతనంగా చేరనున్న విద్యార్థులకు అటానమస్ హోదా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు, ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్, ఏవో బండారు సీతారామయ్య, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## అవోపా సామాజిక సేవలు అభినందనీయం



వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, అవోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో పేద వర్గాల సంక్షేమం కోసం అవోపా చేస్తున్న సేవలు అభినందనీయమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పేదలు, వృద్ధులకు నెలవారీ పెన్షన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ అవోపా తరపున నెలకు రూ.400 చొప్పున 100 మందికి పెన్షన్లు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా వాసవీ విద్యానిధి కమిటీ అధ్యక్షుడు పొట్టి సుబ్రహ్మణ్యంతో పాటు టీజేపీఎస్ కళాశాలకు నూతన కరస్పాండెంట్‌గా ఎన్నికైన అవోపా సభ్యులు కేవీ బ్రహ్మం, కోశాధికారి వడకట్టు కృష్ణానందంను సత్కరించారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ అవోపా ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా వచ్చే నెలలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీతో పాటు సివిల్స్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థుల్ని దత్తత తీసుకుని చదివిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రామలింగేశ్వరరావు, అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మట్టుపల్లి రవికుమార్, గీతామందిరం మాజీ చైర్మన్ అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

## జూద స్థావరాలపై పోలీసుల దాడులు



అరెస్టు చేసిన జూదరులతో ఎస్ఐ డి.రవీంద్రబాబు

ప్రత్తిపాడు: రెండు గ్రామాల్లోని రహస్య జూద స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు చేసి, పన్నెండు మంది జూదరులను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు వివరాల మేరకు.. పెద గొట్టిపాడులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం స్పెషల్ బ్రాంచ్ తో పాటు ఎస్ఐకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.15,010 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ప్రత్తిపాడు శివారులో..**

ప్రత్తిపాడులోని శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రవీంద్రబాబు జూద స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,830 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రవీంద్ర బాబు తెలిపారు.

### వ్యక్తి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసారు. శివరామనగర్ 12వ లైనుకు చెందిన మన్నం రమేష్ (55) ఈ నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని భార్య సంతోషం భర్త ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**వ్యక్తిపై ముగ్గురి దాడి**

ముగ్గురు వ్యక్తులు వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వికలాంగుల కాలనీకి చెందిన షేక్ మస్తాన్‌వలి ఆదివారం కృష్ణబాబు కాలనీకి వెళ్లాడు. ఈ సమయంలో అకారణంగా ముగ్గురు వ్యక్తులు బీరు బాటిల్, చేతులు, కాళ్లతో మస్తాన్ వలిపై దాడి చేసి గాయపరిచారు. అతడి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి**

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి చెందిన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బృందావన్ గార్డెన్స్ 1వ లైనులో నివసించే మన్నవ వెంకట్రావు ఈ నెల 15న మృతి చెందాడు. శరీరంపై గాయాలున్నాయని బంధువులు ఆరోపించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

**భర్త మరణంపై భార్య ఫిర్యాదు**

భర్త మరణంపై భార్య ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. భారత్‌పేటకు చెందిన మీసాల శ్రీనివాసరావు (55) ఈ నెల 16న విధుల నిమిత్తం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అయితే, అతడి మృతదేహాన్ని భార్య ఉషారాణి మార్చురీలో గుర్తించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా ఆదివారం కేసు నమోదు చేశారు.

**జీఆర్‌ఈ, టోఫెల్ పరీక్షలు రాస్తున్న ముగ్గురి అరెస్టు**

డబ్బులు తీసుకుని ఒకరికి బదులుగా జీఆర్‌ఈ, టోఫెల్ పరీక్ష రాస్తున్న ముగ్గురు వ్యక్తులపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన విఘ్నేష్ , నెల్లూరు జిల్లాకు చెందిన ముకేష్, గుంటూరు పట్టాభిపురానికి చెందిన గోపిరెడ్డి జీఆర్‌ఈ, టోఫెల్ పరీక్షలు రాసి పాస్ చేయిస్తామని ఒక్కో విద్యార్థి నుంచి రూ. 40వేలు తీసుకున్నారు. ఆదివారం అరండల్‌పేటలోని ఓ లాడ్జిలో ముగ్గురు పరీక్ష ఆన్‌లైన్‌లో రాస్తుండగా పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని ఏడుగురు విద్యార్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### భర్తపై డాక్టర్ భార్య ఫిర్యాదు

పట్నంబజారు: భర్త వేధింపుల్ని తట్టుకోలేని వైద్యురాలైన భార్య దిశ యాప్ ఎస్ఓఎస్ కాల్ చేసి పోలీసుల్ని ఆశ్రయించిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులుగా పనిచేసే డాక్టర్ ఉమాదేవి, ఆమె భర్త డాక్టర్ ఉపేంద్ర సీతారామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య కుటుంబ సమస్యలు రావడంతో కొద్ది కాలంగా వివాదాలు జరుగుతున్నాయి. భర్త ఉపేంద్ర ఆదివారం తెల్లవారుజామున భార్య ఉమాదేవిపై దాడి చేయడంతో ఆమె దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసింది. విషయం తెలుసుకున్న పాత గుంటూరు పీఎస్ ఎస్‌హెచ్‌వో ఎం.వి. సుబ్బారావు సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపి, ఎటువంటి ఘటనకు తావులేకుండా అడ్డుకున్నారు. అనంతరం స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. వివాదం పరిష్కారం కాకపోతే దిశ స్టేషన్ వారిని పంపుతామని చెప్పారు.

**జూదరుల అరెస్టు**

నల్లచెరువు 18వ లైనులోని ఓ నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న లాలాపేట పోలీసులు ఆదివారం దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 14వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

### ఆలయాలను శుభ్రపరిచిన ప్రణవ పీఠం సేవకులు

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణంలోని సహస్రలింగేశ్వరస్వామి, వీరాంజనేయ స్వామి దేవాలయాలను ఏలూరు ప్రణవ పీఠం సేవకులు ఆదివారం శుభ్రపరిచారు. పీఠం వ్యవస్థాపకులు వి.పద్మాకర్ సూచనల మేరకు సభ్యులు ఎస్.వంశీ, భాగ్యశ్రీ బృందం ఆలయాల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రణవపీఠం సేవకులు మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఒక దేవాలయాన్ని తమ సేవకులు శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. ఏడాదిగా సుమారు 60కు పైగా దేవాలయాలను పరిశుభ్రపరిచినట్లు వెల్లడించారు. పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలు, దుమ్ము ధూళిని దులుపుతున్నట్లు తెలిపారు.

### ఎంఈవో-2 పోస్టులు భర్తీ

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని రెండు మండలాలకు ఎంఈవో-2 పోస్టులను భర్తీ చేశారు. ప్రత్తిపాడు మండలానికి ఎంఈవో-2గా పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం, కారుచోల హెచ్ఎం గరికపాటి లీలారాణి, వట్టిచెరుకూరు మండలానికి పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల మండలం, కరాలపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం డి.నిర్మలను నియమించినట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి తెలిపారు. ఎంఈవో-2 పోస్టుల్లో జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులను నియమించారు.

## యానాదులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పెంచలయ్య

నెహ్రూనగర్: యానాదులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించి వారు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేయాలని యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.సి.పెంచలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ యానాదులకు ఎమ్మెల్సీ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని యానాదులకు కేటాయించాలన్నారు. యానాదులు అధికంగా ఉన్న కోవూరు ఎమ్మెల్యే సీటును వారికే కేటాయించాలని పలు డిమాండ్లతో ఆగస్టులో విజయవాడ కేంద్రంగా లక్ష మందితో యానాది గర్జన నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు మేకల శ్రీనివాస చక్రవర్తి, యందేటి వెంకట సుబ్బయ్య, చేవూరు సుబ్బారావు, చెంబేటి ఉష, జున్ను కల్యాణి, బాపట్ల బ్రహ్మయ్య, కొమరగిరి సూరిబాబు, రాచగిరి మధు, చౌటూరు రమేష్, తలపల సాంబయ్య పాల్గొన్నారు.

## 'రంగు రంగుల కవిత్వం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయ ప్రాంగణంలో ఆదివారం అనిల్ బత్తుల, గాలి నాసరరెడ్డి సంపాదకత్వంలో వెలువడిన 'రంగుల రంగుల కవిత్వం' పుస్తకాన్ని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణ ఆవిష్కరించారు. ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. మరుగున పడుతున్న కవిత్వాన్ని పునరుద్ధరించే ప్రక్రియలో గ్రంథాలయాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. మూల కవితలను సూచిస్తూ, అనువాదాలు ఏరీతిగా సాగాయో కందిమళ్ల శివప్రసాద్ వివరించారు. ప్రపంచ కవులందరి ఆలోచనా దృక్పథం ఒకేరీతిలో సాగుతుందని, అనువాదాల్ని పరిశీలిస్తే స్త్రీ అర్థమవుతుందని మోదుగుల రవికృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



ఎమ్మెల్యే సుచరితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రత్తిపాడు తహసీల్దారు సిద్దార్థ

ప్రత్తిపాడు: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నియోజకవర్గానికి పలువురు అధికారులు వచ్చారు. బదిలీపై వచ్చిన వట్టిచెరుకూరు ఎంపీడీవో గాజుల శేషగిరిరావు, ప్రత్తిపాడు తహసీల్దార్ గుమ్మడి సిద్దార్థ, కాకుమాను ఎంపీడీఓ పోకూరి రామకృష్ణ, ఈవోపీఆర్డీ కావూరు జవహర్‌లాల్ నెహ్రూ, వట్టిచెరుకూరు ఈవోపీఆర్డీ తలపల పార్వతీ గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి వర్తించేలా చూడాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉండాలని సూచించారు.

## బారికేడ్లు ఏర్పాటు



బారికెడ్లను ఏర్పాటు చేసిన ఎస్ఐ నరహరి, సిబ్బంది

గుంటూరు రూరల్: ప్రయాణికుల రక్షణ, ప్రమాదాల నివారణకు సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంబీటీఎస్ కళాశాల సెంటర్‌లో బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ నరహరి తెలిపారు. ఆదివారం బారికేడ్లను ఏర్పాటు చేసి, వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ కాలేజ్ సెంటర్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి తోడు ఎక్కువగా కళాశాలల విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. వాటిని అరికట్టేందుకు బీఎస్ఆర్ జ్యూయలర్స్ అందించిన సుమారు 12 బారికేడ్లను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొనారు. ప్రయాణికులు గమనించి, జాగ్రత్తగా ప్రయాణించాలని ఆయన సూచించారు.

### బాజీ బాబా దర్గాలో అన్నదానం



పెదకాకాని: స్థానిక బాజీబాబా దర్గాలో భక్తులకు ఆదివారం అన్న సంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. దర్గా ప్రాంగణంలోనే నిద్రలు చేసే వారికి స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సహకారంతో అక్కడే అన్నసంతర్పణ జరిగింది. బాజీబాబా దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని ఎస్ఐ పాదర్తి కోటేశ్వరరావు, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, దర్గా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.